క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళం



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి నిత్యాన్నదానానికి హైదరాబాద్ వాస్తవ్యులు అబ్బూరి శేఖర్, మాధవీ వనజ రూ. 50,116 విరాళంగా మంగళవారం సమర్పించారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు, అభిషేకాలు చేయించారు. అనంతరం ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావుకు విరాళాన్ని అందించారు. దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు. సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదనరావు, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



బంటుమిల్లి: స్థానిక కొమ్మారెడ్డి ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థి టి.దీక్షిత్ జాతీయ స్థాయి కరాటే పోటీలో ప్రథమ స్థానం సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ కె.కిషోర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న ఒంగోలు పర్వతరెడ్డి ఆనంద్ మినీ స్టేడియంలో సియ కొక్కై కరాటే ఇంటర్నేషనల్ పోటీలు జాతీయ స్థాయిలో నిర్వహించారు. పలు రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో కొమ్మారెడ్డి విద్యార్థి 10 సంవత్సరాల కటా విభాగంలో ప్రథమ బహుమతి సాధించాడు. విజేతకు నిర్వాహకులు మెడల్, ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. పాఠశాలకు గుర్తింపు తెచ్చిన విజేత దీక్షిత్‌ను, కోచ్ వెంకటేశ్వరరావును డైరెక్టరు కిషోర్, హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

నేటి నుంచి దివ్యాంగుల ధ్రువీకరణ శిబిరాలు

గూడూరు: మండల పరిధిలో వికలాంగ పెన్షన్లు పొందుతున్న దివ్యాంగుల వైకల్యం పునః ధ్రువీకరణకు ఈనెల 20, 21 తేదీల్లో మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.వి.రామకృష్ణ తెలిపారు. మండలంలో 1289 మంది వికలాంగ పెన్షన్లు పొందుతున్న లబ్ధిదారులు ఉండగా వారిలో 93 మంది ఇప్పటి వరకు రీ వెరిఫికేషన్ క్యాంపులకు హాజరుకాలేదన్నారు. చెవుడు, మూగ విభాగాలకు చెందిన వారిని బుధవారం, మెంటల్ రిట్రీడేషన్, మెంటల్ ఇల్‌నెస్ వారు గురువారం క్యాంపునకు హాజరుకావాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో ఆరుద్ర నక్షత్ర అభిషేకాలు



పెడన: పట్టణంలోని శ్రీ వాసవీమాత క్షేత్రంలో వేంచేసి ఉన్న శ్రీ అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వర స్వామి జన్మ నక్షత్రం ఆరుద్రను పురస్కరించుకుని మంగళవారం సామూహిక రుద్రాభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కోట సతీష్‌శర్మ వేద మంత్రాల మధ్య మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు ఘనంగా జరిగాయి. ఆర్యవైశ్య మండల సంఘం ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించగా 35 మంది దంపతులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమ పూజ



నాగాయలంక: శ్రావణ బహుళ ఏకాదశి, శ్రావణ మంగళవారం విశిష్టత పురస్కరించుకుని స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు. వేద పండితుడు దీవి వేణుగోపాల్ బ్రహ్మత్వంలో 25 మంది సామూహిక కుంకుమ పూజ జరిపారు. ఈ సందర్భంగా మహిళలు విష్ణు సహస్రనామ పారాయణం చేశారు.

ఎస్టీలకు శాశ్వత చిరునామాతో ఆధార్‌కార్డుల జారీకి కృషి

పెడన: పట్టణంతో పాటు మండలంలో ఆధార్‌కార్డు లేకుండా సంచరిస్తూ జీవిస్తున్న సంచార జాతికి చెందిన ఎస్టీలను 15 మందిని గుర్తించామని, వీరికి శాశ్వత చిరునామాతో ఆధార్‌కార్డులు జారీకి కృషి చేస్తామని ఇన్‌చార్జి తహసీల్దార్ కె.అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలో 10 మంది, మండలంలో ఐదుగురు ఎస్టీలను ఆధార్‌కార్డు లేకుండా ఉన్న వారిని గుర్తించి తహసీల్దార్ కార్యాలయానికి ఒక స్వచ్ఛంద సంస్థ వారు తీసుకురావడంతో వారిని అభినందించి వారికి శాశ్వత చిరునామా గుర్తించి దరఖాస్తులపై అటెస్టెడ్ సంతకాలు చేసి దరఖాస్తు చేసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

పెరుగుతున్న వరద ఉధ్ధృతి

- జలదిగ్బంధంలో ఎడ్లంక
- వరద పెరిగితే పులిగడ్డ, దక్షిణ చిరువోలులంక గ్రామాలకు ముప్పు



పులిగడ్డ అక్విడెక్ట్‌ను తాకుతూ ఉధ్ధృతంగా ప్రవహిస్తున్న వరద

అవనిగడ్డ: వరద ఉధ్ధృతి పెరుగుతోంది. దీంతో దివిసీమలో ముంపు గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. అవనిగడ్డ మండల పరిధిలోని ఎడ్లంక ఇప్పటికే జలదిగ్బంధంలో ఉండగా, వరద ఉధ్ధృతి పెరిగితే మరికొన్ని గ్రామాలు నీట మునిగే ప్రమాదం ఉంది. కలెక్టర్ డీకే బాలాజీ నాగాయలంక మండలంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి అధికారులను అప్రమత్తం చేశారు.

పడవల సాయంతో రాకపోకలు

అవనిగడ్డ మండల పరిధిలోని ఎడ్లంక జలదిగ్బంధంలో ఉంది. గ్రామానికి వెళ్లే రహదారి వరదకు కొట్టుకుపోవడంతో గ్రామస్తులు పడవ సాయంతో రాకపోకలు సాగిస్తున్నారు. ఇళ్ల సమీపంలోకి వరద ప్రవాహం రావడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరద పెరిగితే మరికొన్ని గృహాలు కోతకు గురై నదిలో కలిసి పోతాయని బాధితులు వాపోతున్నారు. వరద మరింత అధికమైతే మండల పరిధిలోని పులిగడ్డ పల్లెపాలెం, వసుమట్ల, రేగుల్లంక, దక్షిణ చిరువోలులంక గ్రామాలు నీట మునిగే ప్రమాదం ఉంది.

అక్విడెక్టును తాకుతూ

ప్రకాశం బ్యారేజీ నుంచి 4.73లక్షల క్యూసెక్కుల వరదనీటిని దిగువకు వదిలారు. ప్రకాశం బ్యారేజీకి ఎగువ నుంచి నీటి ప్రవాహం పెరగడంతో ఇది మరింత పెరిగే అవకాశం ఉందని ఉన్నతాధికారులు చెప్పారు. పులిగడ్డ వద్ద వరదనీరు అక్విడెక్టును తాకుతూ ప్రవహిస్తోంది. వరద ప్రవాహం మరో మూడడుగులు పెరిగితే అక్విడెక్టుపై నుంచి వెళ్లే అవకాశం ఉంది. అదే జరిగితే పంటకాలువలకు వరద నీరు పోటెత్తే ప్రమాదం ఉంది. వరద ప్రవాహం అధికం కావడంతో పులిగడ్డకు సందర్శకుల తాకిడి ఎక్కువైంది.

వాణిజ్య పంటలకు ముప్పే

చల్లపల్లి, మోపిదేవి, అవనిగడ్డ మండలాల్లోని లంకల్లో రైతులు అరటి, పసుపు, కంద, మిర్చితో పాటు పలు రకాల కూరగాయల తోటలను సాగుచేస్తున్నారు. భారీ వర్షాల కారణంగా ఇప్పటికే ఈ తోటలు ముంపునకు గురయ్యాయి. 8 లక్షల క్యూసెక్కులకు వరద పెరిగితే ఈ తోటలను ముంచెత్తే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు పంటలు మునిగితే తీవ్ర నష్టం చవి చూడాల్సి వస్తుందని చెప్పారు.



సాగర సంగమ ప్రాంతంలో సముద్రంలో చేరుతున్న వరదనీరు

ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు

వరద మరింత పెరిగే అవకాశం ఉండటంతో దివిసీమలోని ముంపు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించడానికి చర్యలు తీసుకుంటున్నారు. అందుకు సిద్ధంగా ఉండాలని ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

సంగమం వద్దకు చేరుతున్న వరద నీరు

కోడూరు: ప్రకాశం బ్యారేజీ నుంచి విడుదల చేసిన లక్షలాది క్యూసెక్కుల వరద నీరు హంసలదీవి వద్ద సముద్రంలో చేరుతున్నాయి. బ్యారేజీ నుంచి సుమారు 4.73లక్షలకు పైగా వరద నీరు విడుదల చేయడం ఆ నీరు మొత్తం కృష్ణా సాగర సంగమ ప్రాంతంలో కలుస్తోంది. సాగర సంగమం వద్ద వరద నీటి కారణంగా రంగు మారి కనిపిస్తోంది.

కె. కొత్తపాలెం(మోపిదేవి): కృష్ణానదికి వరదనీరు వదిలినందున నదీపరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో జె.స్వర్ణభారతి ఆయా గ్రామాల ప్రజలకు సూచించారు. మండలంలోని నది ఒడ్డున ఉన్న గ్రామాలు కె. కొత్తపాలెం, బొబ్బర్లంక తదితర గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. సర్పంచ్ దొప్పలపూడి గంగాభవాని, మండల ప్రత్యేక అధికారి సలీం తదితరులు పాల్గొన్నారు.

వరద నీరు గ్రామాల్లోకి రాకుండా ప్రత్యేక చర్యలు

అవనిగడ్డ: వరద, వానల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా పనిచేయాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలోని నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ఏటిమొగ, గుల్లలమోద, కె.కొత్తపాలెం, విశ్వనాథపల్లి, పిట్టల్లంక, లింగన్నకోడు, కోడూరు, ఉల్లిపాలెం, ఉత్తరచిరువోలులంక, అయోధ్యలో వరద నీరు గ్రామాల్లోకి రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాల వల్ల 35 చోట్ల పంటకాలువల గట్లు దెబ్బతినగా మరమ్మతులకు అంచనాలు రూపొందించామన్నారు. సమావేశంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, ఇరిగేషన్, డ్రెయినేజీ, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

నాగాయలంక తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్



నాగాయలంక శ్రీరామ పాదక్షేత్రం వద్ద వరద ప్రవాహం

నాగాయలంక: కృష్ణా నది వరద ప్రభావం, రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉండటంతో వాతావారణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు నాగాయలంక తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ సీహెచ్‌వీ ఆంజనేయప్రసాద్ మంగళవారం తెలిపారు. ప్రకాశం బ్యారేజి వద్ద 7లక్షల క్యూసెక్కుల వరద నీరు రాక, అధిక వర్షాలు పడే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజల ఇబ్బందులు తెలుసుకోవడానికి రోజుకు రెండు షిఫ్టులు, ఒక్కో షిఫ్టునకు వీఆర్వో, వీఆర్ఏ చొప్పున ఉద్యోగులను నియమించినట్లు తహసీల్దార్ వివరించారు. సంబంధిత ఉద్యోగులు షెడ్యూల్ ప్రకారం విధులకు హాజరు కావాలని, ఉన్నతాధికారుల సందేశాలను నోట్ చేయాలని ఆదేశించారు. స్థానిక శ్రీరామపాద క్షేత్రం పుష్కరఘాట్‌లో కృష్ణానది వరద నీటి మట్టం మంగళవారం క్రమంగా పెరిగింది. ఘాట్‌లోని కృష్ణవేణి మాత విగ్రహం, రామలింగేశ్వరుని మండపం వరద నీటిలో సగం మునిగిపోయి ముందుకొచ్చింది.

రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి

కోడూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రీ సర్వేలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి అన్నారు. మంగళవారం మండలంలోని పిట్టల్లంక సచివాలయం వద్ద రీ సర్వే వివరాలు వెల్లడించేందుకు ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. గ్రౌండ్ ట్రూతింగ్‌లో సర్వే బృందాలు పిట్టల్లంక రెవెన్యూ పరిధిలో రీ సర్వే ప్రక్రియను విజయవంతం పూర్తి చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. సర్వే బృందాలు పొలాలను నిశితంగా సర్వే చేసి వివరాలను పూర్తిస్థాయిలో పొందుపర్చినట్లు చెప్పారు. సర్వే వివరాలకు సంబంధించి రైతులకు 9(2) నోటీసులు అందించామని, వీటిల్లో ఏమైనా అభ్యంతరాలు ఉంటే వారంలోపు స్థానిక కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. రెవిన్యూ అధికారులు, సర్వే బృందాలు ఇచ్చిన ఆర్‌ఓఆర్ కాపీకి కలెక్టర్ ఆమోదం లభించిందని, రైతులు కూడా వీటిని పరిశీలిస్తే కొత్త ఎల్‌పీఎం (సర్వే నెంబర్)ను విస్తీర్ణం ఆధారంగా ఇవ్వనున్నట్లు తహసీల్దార్ చెప్పారు. రైతులు పలు సమస్యలపై రెవిన్యూ అధికారులను ప్రశ్నించగా, వాటికి తహసీల్దార్ సమాధానమిచ్చారు. ఆర్ఐ సుభాషిణి, రీసర్వే డీటీ పద్మప్రియ, వీఆర్వో గోపాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి

చల్లపల్లి: ముందస్తు అనుమతులు లేకుండా వినాయక ఉత్సవాలు నిర్వహించే వారిపై చర్యలు తీసుకుంటామని చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు హెచ్చరించారు. మంగళవారం ఆయన సర్కిల్ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ చల్లపల్లి సర్కిల్ పరిధిలో ఉన్న చల్లపల్లి, మోపిదేవి, ఘంటసాల మండలాల్లో గణేష్ ఉత్సవాలు నిర్వహించేవారు ముందస్తుగా కమిటీ ఏర్పాటుచేసుకోవాలన్నారు. ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుంటే బాధ్యత కమిటీదేనని పేర్కొన్నారు. వినాయక పందిళ్ల గ్నిప్రమాదాలు నివారించేందుకు ముందుజాగ్రత్తగా ఇసుక, నీటి డ్రమ్ములు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. పబ్లిక్ ప్రదేశాల్లో పంచాయతీ అనుమతి, ప్రయివేటు స్థలాల్లో అయితే సంబంధిత యజమాని నుంచి నిరభ్యంతర పత్రాలు తీసుకుని సమర్పించాలని అన్నారు. సీఐ, డీఎస్పీ అనుమతి లేకుండా మైకులు, డీజేలు పెట్టకూడదని హెచ్చరించారు.

ముంపు ముంగిట్లో ఆక్వా చెరువులు



పిట్టల్లంక సమీపంలో ముంపు ముంగిట్లో రొయ్యల చెరువులు

కోడూరు: కృష్ణా నది నుంచి భారీగా వరద నీటిని విడుదల చేయడంతో ఆక్వా చెరువులకు ముంపు వాటిల్లే ప్రమాదం ఉందని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని వి.కొత్తపాలెం నుంచి హంసలదీవి వరకు రైతులు కృష్ణానది, కరకట్ట మధ్య ఆక్వా సాగును చేపట్టారు. సుమారు 1500 ఎకరాల్లో సాగు జరుగుతోంది. వరద ఉధ్ధృతి పెరగడంతో సాగు చేపట్టిన రైతులు హడలిపోతున్నారు. భారీగా వరద నీటిని విడుదల చేస్తే చెరువులు మొత్తం నది నీటితో మునిగిపోయే ప్రమాదం ఉందని వాపోతున్నారు. ప్రస్తుతం చెరువుల్లో రొయ్యలు 80 నుంచి 100 కౌంట్లో ఉన్నాయి. గతేడాది ఇదే సమయంలో వరద రావడంతో చెరువులు మొత్తం నదిలో కలిసిపోయి సుమారు రూ. 25కోట్ల మేర నష్టం జరిగిందని రైతులు హడలిపోతున్నారు. వరద పెరిగే అవకాశం ఉందని అధికారులు చెప్పడంతో కొంతమంది రైతులు హడావుడిగా చెరువులను పడుతూ కనిపించారు. రొయ్యల కౌంట్‌కు రాకపోయినా నష్టం జరగకూడదనే ముందు జాగ్రత్తగా చెరువులను పట్టినట్లు ఆక్వా రైతులు తెలిపారు.

నాగాయలంక పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ బాధ్యతల స్వీకరణ

నాగాయలంక: ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీలో నాగాయలంక పీఏసీఎస్ నూతన చైర్మన్‌గా ముమ్మారెడ్డి శ్రీనివాసరావు(భావదేవరపల్లి), తాడేపల్లి వెంకట పాపారావు(నంగేగడ్డ),బండ్రెడ్డి బాలకృష్ణ అలియాస్ బోసు (మర్రిపాలెం)సభ్యులుగా బాధ్యతలు స్వీకరించినట్లు సొసైటీ సీఈఓ కె.వి. రామాంజనేయులు మంగళవారం తెలిపారు. బాధ్యతల స్వీకరణ కార్యక్రమం సోమవారం రాత్రి స్థానిక సాయి మెస్ మినీ ఫంక్షన్ హాలులో జరిగిందని ఆయన చెప్పారు.

పారిశుద్ధ్య కార్మికురాలికి సీఎం సన్మానం



చల్లపల్లి: పురిటిగడ్డ గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికురాలు పల్లెకొండ హేమలతను ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం మంగళగిరిలో జరిగిన పి–4 కార్యక్రమ సభలో సన్మానించారు. పురిటిగడ్డ మండల పరిషత్ పాఠశాలలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న హేమలత అదే గ్రామానికి చెందిన వృద్ధురాలు చిల్ల కనికరమ్మను దత్తత తీసుకుని సహాయ సహకారాలు అందిస్తోంది. ఆమెను ప్రత్యేకంగా మంగళగిరి పిలిపించి హేమలతను చంద్రబాబు నాయుడు ఘనంగా సన్మానించారు.

సబ్సిడీపై పశువుల దాణా విత్తనాలు



విత్తనాల బ్యాగులను అందజేస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారి నరసింహులు, ఏడీ బాబురావు

పెడన: పాడి రైతులకు రాయితీపై పశువుల దాణా విత్తనాలను జిల్లా వ్యాప్తంగా అందజేస్తున్నామని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి ఎన్‌సీహెచ్ నరసింహులు అన్నారు. మంగళవారం ఆయన పెడన పశుసంవర్ధక శాఖ ఏడీ కార్యాలయాన్ని, ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాడి రైతులకు దాణా పంపిణీ సమయంలో రావడంతో ఏడీ కొనకళ్ల బాబురావు జిల్లా అధికారితో పాడి రైతులకు సబ్సిడీపై దాణా విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ జిల్లాలో రెండు విడతలుగా 50 మెట్రిక్ టన్నుల విత్తనాలు వచ్చాయన్నారు. ప్రతి మండలానికి రెండు మెట్రిక్ టన్నులు చొప్పున అందజేశామని వివరించారు. ఆసక్తి ఉన్న ప్రతిపాడి రైతుకు ఎకరం పొలంలో పశువుల దాణా పెంచుకోవడానికి కేజీ విత్తనాల ధర బయట మార్కెట్‌లో రూ.460 ఉందని, దీన్ని రైతులకు రూ.345 సబ్సిడీపోనూ రూ.115కు ఇస్తున్నట్లు వివరించారు. ఒక్కో రైతుకు పది కేజీల నుంచి 20 కేజీల వరకు ఇస్తారన్నారు. కార్యక్రమంలో పశువైద్యాస్పత్రి సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

ముంపులోనే వరి పొలాలు



నిండుకుండలా మారిన రత్నకోడు డ్రెయిన్

పాలకుల నిర్లక్ష్యం.. రైతుల పాలిట శాపం



కోడూరులో నీటిలోనే నానుతున్న వరినాట్లు, నారుమళ్లు

కోడూరు: డ్రెయినేజీల ప్రక్షాళన విషయంలో కూటమి ప్రభుత్వం వ్యవహరించిన నిర్లక్ష్య ధోరణి నేడు రైతులు పాలిట శాపంగా మారింది. వారం రోజుల క్రితం రెండు గంటల పాటు కురిసిన భారీ వర్షం దివిసీమ రైతాంగానికి తీవ్ర నష్టం మిగిల్చింది. కేవలం రెండు గంటల్లో అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక మండలాల్లో సుమారు 15 సెంటీమీటర్లకు పైగా వర్షం కురవడంతో వరిపొలాలు మొత్తం చెరువులుగా మారాయి. ప్రస్తుతం కోడూరు మండలంలోని వి.కొత్తపాలెం, విశ్వనాథపల్లి, మాచవరం, లింగారెడ్డిపాలెం, పిట్టల్లంక, దింటిమెరక ప్రాంతాల్లో పొలాల్లో నీరు గట్లపై నుంచి ప్రవహిస్తోంది. పొలాల్లో నీరు బయటకు పోయేందుకు దోహదపడే డ్రెయిన్లు నిండుకుండలా ప్రవహిస్తున్నాయి. అలాగే వర్షం పడిన మరుసటి రోజు డ్రెయినేజీ అధికారులు, కూటమి నేతలు వచ్చి రత్నకోడు డ్రెయిన్‌పై వలకట్లను తొలగిస్తామంటూ హడావుడి చేశారే గాని వీటిని పూర్తిస్థాయిలో తొలగించలేదు. దీంతో సుమారు నాలుగు వేల ఎకరాల్లో వరిదుబ్బులు కుళ్లిపోవడంతో పాటు వందలాది ఎకరాల్లో నారుమళ్లు పూర్తిగా నీట మునిగి, పైరు నాటు వేసేందుకు ఉపయోగపడకుండా మారింది. పాలకులు స్పందించి పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

ఈ-పంట నమోదులో సమన్వయ లోపం

- అందుబాటులో లేని రెవెన్యూ సిబ్బంది
- వ్యవసాయ శాఖ వీఏఏలతోనే నమోదు
- రైతు పొలంలో ఉండి ఫొటో దిగితేనే నమోదుకు అవకాశం
- ఇప్పటికే అన్నదాత సుఖీభవ ద్వారా కోత
- పెడన నియోజకవర్గంలో 60 వేల ఎకరాలకు పైగా వివిధ పంటలు
- ఈ-క్రాప్ వంద శాతం కావడం లేదంటున్న అధికారులు



బల్లిపర్రులో ఈ-పంట నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది(ఫైల్)

పెడన: ఈ-పంట నమోదు చేసేందుకు వ్యవసాయశాఖ సిద్ధమైంది. రెవెన్యూ, వ్యవసాయశాఖలు సమన్వయంతో ఈ-పంట నమోదు చేయాల్సి ఉంది. అయితే రెవెన్యూ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో కేవలం వ్యవసాయశాఖ వీఏఏలు మాత్రమే ఈ-పంట నమోదు చేస్తున్నారు. అది కూడా తెలిసిన వారికి చేస్తుండటం, తెలియని రైతులకు సమాచారం తెలియజేయడంలో వ్యవసాయశాఖ విఫలమవుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కారణం ఇటీవల బదిలీల నేపథ్యంలో ప్రతి గ్రామ సచివాలయాల పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో కొత్తగా బాధ్యతలను చేపట్టిన వీఏఏలకు రైతుల పూర్తి సమాచారం తెలియకపోవడం ఒకటి. వీరికి గ్రామ రెవెన్యూ అధికారులు(వీఆర్వోలు) సహకరించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతులు తాము వేసిన పంట విషయంలో కూడా స్పష్టత ఇవ్వడంలో అయోమయానికి గురవుతున్నారు. ఇప్పటికే పలు దఫాలుగా వెద సాగు వేసి నష్టపోయిన రైతులు కొందరు నారు కొనుగోలు చేసి పంట వేస్తున్నారు. ఆ నారు ఏ రకం అనే విషయంలో కూడా చేతికి పంట వచ్చేవరకు కూడా తెలియని దుస్థితిలో అన్నదాతలున్నారు. ఈ-పంటలో ఒక రకం వేశామని చెప్పిన రైతుకు విక్రయించే సమయంలో ఆ పంట కాకుండా వేరే పంట చేతికి వచ్చిన సమయంలో ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతోంది. మరికొందరు రైతులు తమకు ఎటువంటి సమాచారం ఉండటం లేదని వాపోతున్నారు.

ఈ-పంటతో ప్రభుత్వ పథకాలకు అనుసంధానం

ఒకసారి ఈ-పంట నమోదు చేసుకున్నా కూడా ఏటా తప్పనిసరిగా నమోదు చేయాల్సిందే. ఏ రకం పంట, ఎంత విస్తీర్ణం, సర్వే నంబరుతో సహా నమోదు చేయాల్సి ఉంటుంది. రైతులు తాము పండించిన పంటను అమ్ముకోవాలన్నా, ప్రభుత్వం నుంచి పథకాలు పొందాలన్నా, సబ్సిడీ తీసుకోవాలన్నా తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేయాలి. పెడనలో 60 వేల ఎకరాలలో వివిధ పంటలు సాగు అవుతుండగా ఇందులో 56 వేల ఎకరాలు వరిసాగు అవుతుంది. సాగు చేసిన ప్రతి పంట ఈ-పంటలో నమోదు చేయాలి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద కొందరు రైతులకు పథకం వర్తింప జేయకపోవడంతో కనీసం ఈ-పంట అయినా నమోదు చేయిస్తే వచ్చే ఏడాది నుంచి అన్నదాత సుఖీభవ పడుతుందనే ఆలోచనల్లో రైతులున్నారు. అదీ కాకుండా పూర్తిస్థాయిలో సమాచారం ఇవ్వడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. రైతు పొలంలోకి వెళ్లి ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉండటంతో తమకు సమాచారం లేదని, ఎప్పుడు తీస్తారని కొందరు రైతులు పేర్కొనడం గమనార్హం. అదీ కాకుండా కౌలు దారులు, ఇటీవల కొత్తగా పంట పొలాలు కొనుగోలు చేసిన వారు, వారసత్వంగా పొందిన వారితో పాటు ఉమ్మడి ఆస్తిని(పొలాన్ని) బయట వేర్వేరు వ్యక్తులు కొనుగోలు చేసిన వాటికి సంబంధించిన వారి విషయంలో ఈ-పంట నమోదులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పెడన నియోజకవర్గంలో 60 వేల ఎకరాల్లో సాగు

నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ పంటల సాగును సుమారుగా పరిశీలిస్తే పెడన మండలంలో 22వేలు, గూడూరులో 20వేలు, బంటుమిల్లిలో 14వేలు, కృత్తివెన్నులో ఏడువేల ఎకరాలల్లో సాగు అవుతున్నాయి. ఇవన్నీ కూడా ఈ-పంటలో నమోదు కావాల్సి ఉంది.

రైతులకు సమాచారం తెలియజేస్తున్నాం



ప్రస్తుతం ఈ-పంట నమోదుకు రెండు నెలలు సమయం ఉంది. క్షేత్రస్థాయిలోని రైతు సేవా కేంద్రం సిబ్బంది ఈ పనిలోనే నిమగ్నమయ్యారు. రెవెన్యూ శాఖ వారి సహకారంతో ఈ పంట నమోదు చేస్తున్నారు. వీఏఏలు కొత్తవారు అయినా కూడా ప్రతి రైతుకు సమాచారం తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించాం. కొందరు రైతులు ఈ-పంట నమోదుకు ముందుకు రావడం లేదు. ప్రతి రైతు తమ ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీతో పాటు పట్టాదారు పాస్‌పుస్తకం, ఫోన్ తీసుకువెళ్లి వీఏఏలను కలిసి ఫొటో దిగి ఈ పంట నమోదు చేయించుకోవాలని చెబుతున్నాం.

– ఎస్.జెన్నీ, ఏవో, పెడన

నేడు పురిటిగడ్డలో విద్యుత్ సరఫరా నిలిపివేత

చల్లపల్లి: విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులు జరుగుతుండటంతో చల్లపల్లి మండలం పురిటిగడ్డ ఫీడర్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరెంట్ ఏఈ బసవశాస్త్రులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పైప్‌లైన్ పనులు ప్రారంభం

బంటుమిల్లి: ములపర్రు పంచాయతీ శివారు రామన్నమోడికి మంజూరైన తాగునీటి పైపులైను నిర్మాణానికి ముడా చైర్మన్ మట్టా ప్రసాదుతో కలసి పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాదు భూమిపూజ చేశారు. మంగళవారం ములపర్రు రక్షిత మంచినీటి పథకం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీరు శిలాఫలకం ఆవిష్కరించి శంకుస్థాపన చేశారు. రూ. 20 లక్షల నిధులను ముడా నుంచి మంజూరు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు మంగమ్మ, ఇతర నేతలు పాల్గొన్నారు.